www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 9 అక్టోబర్ 2024
5
అన్నమయ్య

రేపు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి-రాయచోటి

అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11న అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వ్యాసరూప, పెయింటింగ్, డిబెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సృజనాత్మకత, ఆలోచనాశక్తిని పెంపొందించడంలో తోడ్పడే విధంగా 'సేవ్ ద గర్ల్ చైల్డ్' థీమ్ తో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇది లింగ సమానత్వం, బాలికల హక్కుల రక్షణ ప్రాముఖ్యతపై అవగాహన పెంచుతుందని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థీ చురుకుగా పాల్గొనాలని కోరారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 10న డైట్ కళాశాల ఆడిటోరియంలో స్టడీ సర్టిఫికెట్‌తో హాజరు కావలసి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు అసదుల్లా బాష, డైట్ లెక్చరర్ (9440084715)ను సంప్రదించగలరని పేర్కొన్నారు.

బొప్పాయి ధర ఊగిసలాట

- దళారుల దోపిడీలో రైతులు విలవిల
- కోడూరులో టన్ను రూ.11 వేలు..'అనంత'లో రూ.25 వేలు
- టన్నుపై రూ.14 వేలు తగ్గింపు
- సూట్ పేరుతో వంద కిలోల బొప్పాయి తీసుకుంటున్న వైనం
- గిట్టుబాటు ధర కల్పించాలంటున్న రైతులు

ప్రజాశక్తి-ఓబులవారిపల్లె

అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాలలో దాదాపుగా 50 వేల ఎకరాల్లో రైతులు బొప్పాయి పంట సాగు చేస్తున్నారు. అధికంగా రైల్వేకోడూరులోనే బొప్పాయి పంట సాగు చేస్తున్నారు. అతివృష్టి, అనావృష్టి, దళారులు, స్థానిక వ్యాపారులు ఇష్టారాజ్యంగా బొప్పాయి కొనుగులు చేస్తుండడంతో రైతన్నకు గిట్టుబాటు ధరలు లభించడం లేదు. పైగా సూట్ పేరుతో వెయ్యి కిలోలకు వంద కిలోలు రైతుల నుండి బొప్పాయి బలవంతంగా తీసుకుంటున్నారు. ప్రతి ఏటా ఈ తంతు జరుగుతున్నా జిల్లా అధికార యంత్రాంగం పట్టించు కోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల కష్టార్జితం పరులపాలవు తోంది. రైల్వేకోడూరు, రాజంపేటలలో మంచి మేలు రకమైన బొప్పాయి పంట సాగు చేస్తున్నారు. అన్నమయ్య జిల్లా పీలేరు, అనంత పురం జిల్లాలో బొప్పాయి కిలో రూ.25లకు (టన్ను రూ.25 వేలు) కొనుగోలు చేస్తున్నారు. రైల్వేకోడూరులో స్థానిక వ్యాపారులు, దళారులు, మర్వాడీలు కుమ్మక్కై సిండికేట్‌గా ఏర్పడి బొప్పాయి కిలో రూ.11లు (టన్ను రూ.11 వేలు) కొనుగోలు చేస్తు న్నారు. కనీసం కిలోరూ.25లతో కొనుగోలు చేస్తే గిట్టుబాటు అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. పైగా సూట్ పేరుతో వెయ్యి కిలోలు బొప్పాయి విక్రయిస్తే సూట్ పేరుతో వంద కిలోల బొప్పాయిని బలవంతంగా దళారులు, స్థానిక వ్యాపారులు, మర్వాడీలు తీసుకుంటున్నారు. తీవ్రంగా నష్టపోతున్న రైతన్నదళారుల ఆటకట్టించి తమకు గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతులు జిల్లా రైతాంగానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఢిల్లీ, బొంబాయి, మార్వాడి సేట్లతో స్థానిక వ్యాపారులు, దళారులు సిండికేట్ అయి కిలో రూ.16లకు ధర తగ్గించారు.

పెట్టుబడులు రాని వైనం : బొప్పాయి సాగు చేసిన రైతులకు పెట్టుబడులు కూడా రావడం లేదు. విత్తనం, దుక్కులు, ఎరువులు పురుగు మందులు, అప్పులు వడ్డీలు, తెగుళ్లు, నివారించుకొని పంట చేతకొస్తే ధర లేకపోవడంతో పెట్టిన పెట్టుబడి రాక రైతుల ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఉంది. రైతులను మోసం చేస్తున్న దళారులకు నోటీసులు ఇచ్చి, చర్యలు తీసుకోవాల్సి ఉంది. కల్తీ, నాసిరక విత్తనాలు, మొలకెత్తక, రైతు నష్టపోతున్నారు. ప్రభుత్వమే సబ్సిడీ విత్తనాలు, కొనుగోలు చేసి రైతులకు అందించాల్సి ఉంది.

ఇటు వ్యాపారులు, అటు దళారులు కలసి బొప్పాయి ధరలతో ఆటాడుకుంటున్నారు. బొప్పాయి ధరలు ఊగిసలాడుతున్నాయి. ఆరుగాలం కష్టించి బొప్పాయి సాగు చేస్తున్న రైతన్నకు గిట్టుబాటు ధరలు లభించడం లేదు. ప్రతి ఏటా అతివృష్టి, అనావృష్టి, దళారులు ఇష్టారాజ్యంగా బొప్పాయి కొనుగోలు చేస్తుండడం, సూటుపేరుతో మోసం చేస్తుండడంతో ధరలు లేక విలవిలలాడుతున్నారు. జిల్లా అధికార యంత్రాం గం జోక్యం చేసుకొని దళారుల ఆటకట్టించి తమకు గిట్టుబాటు ధరలు కల్పించాలని అన్నమయ్య జిల్లాలో బొప్పాయి అత్యధికంగా పండించే రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాలకు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రైతులను మోసగిస్తున్న దళారులు

రైల్వేకోడూరు నియోజకవర్గంలో బొప్పా యి రైతులను దళారులు ధర తగ్గించి, సూట్ పేరుతో మోసం చేస్తున్నారు. పీలేరు, అనంతపు రంలో బొప్పాయి కిలో రూ.25లు ధర ఉంది. కోడూరులో మాత్రం నాణ్యమైన సరుకు కిలో రూ.11లు మాత్రమే ఉంది. వెయ్యి కిలోలకు వంద కిలోలు సూట్ పేరుతో దళారులు దోపిడీ చేస్తున్నారు. కోడూరులో దాదాపు 130 మంది దళారులు ఉన్నారు. వీరు అధికారులను, ప్రభుత్వాన్ని, కంట్రోల్ చేస్తున్నారు. మార్కెటింగ్, ఆర్టికల్చర్ అధికారులు, జోక్యం, చేసుకొని, డైరెక్ట్‌గా, ఢిల్లీ, బొం బాయి, చెన్నై ధర నిర్ణయించి రైతులతో కొనుగోలు చేయిం చాలి. మధ్య దళారులను అరికట్టాలని రైతులకు జరుగుతున్న మోసాన్ని జెసి దృష్టికి తీసుకెళ్లాం.

- సి.హెచ్.చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షులు, సిఐటియు, రైల్వేకోడూరు.

సూట్ పేరుతో దోచుకుంటున్న దళారులు

వెయ్యి కిలోల బొప్పాయికి సూడ్ పేరుతో వంద కిలోలను దళారులు దోచుకుంటున్నారు. దళారులు ఇష్టారాజ్యంగా కొనుగోలు చేస్తుండడంతో గిట్టుబాటు ధరలు లభించడం లేదు.జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకొని దళారుల ఆటలు కట్టించాలి. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలి.

- ఎం.శివయ్య, బొప్పాయి రైతు, రైల్వేకోడూరు.

'శాంసంగ్' కార్మికుల డిమాండ్లు తీర్చాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

తమిళనాడు శాంసంగ్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక గాంధీబజార్‌లోని రాయచోటి శాంసంగ్ దుకాణం వద్ద ధర్నా నిర్వహించారు. సిఐటియు జాతీయ కమిటీ పిలుపు మేరకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు మాట్లాడుతూ తమిళనాడు శ్రీ పెరంబదూర్ ప్రాంతంలోని శాంసంగ్ పరిశ్రమలో నెల రోజుల నుంచి 1500 మంది కార్మికులు ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరుతూ నిరవధిక సమ్మె చేస్తున్నారని తెలిపారు. దక్షిణ కొరియాకు చెందిన బహుళ జాతి సంస్థ సాంసంగ్ భారతదేశంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నప్పుడు, భారత రాజ్యాంగాన్ని గౌరవించాలని పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రకారం కార్మికులు సంఘం పెట్టుకునే హక్కుని గుర్తించాలని, ధరలకనుగుణంగా వేతనాలు పెంచేదాకా ఈ సమ్మెచేసే కార్మికులకు దేశవ్యాప్తంగా మద్దతు తెలియజేస్తామని తెలిపారు. ప్రపంచ శాంసంగ్ వ్యాపారంలో 20 భారతదేశం నుంచే లాభాలను తీసుకుంటూ, భారత కార్మికులను బానిసలుగా చూడడం మానుకోవాలని హెచ్చరించారు. దక్షిణ కొరియాలో పనిచేసే కార్మికులకు 13వేల డాలర్లు చెల్లిస్తూ, భారతదేశ కార్మికుడికి 300 డాలర్లు మాత్రమే చెల్లించడాన్ని తప్పుపట్టారు. బిజెపి ఆర్ఎస్ఎస్ పెద్దలు ఆత్మనిర్బర్ భారత్, మేక్ ఇన్ ఇండియా, స్వదేశీ నినాదం ఇవ్వడమే కాదని విదేశీ బహుళజాతి కంపెనీ అయిన శాంసంగ్ భారత కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న అనాగరిక చర్యలను ఖండించాలన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం నడుచుకునేలా సాంసంగ్ యాజమాన్యాన్ని ఆదేశించాలని సెలవిచ్చారు. తమిళనాడు ప్రభుత్వం పెట్టుబడులను ఆకర్షించాలనే పేరుతో కార్మికుల పోరాటాలను పోలీసులతో నిర్బంధంతో ముగించాలని చూస్తే దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సి.రాంబాబు, తిరుపాల్, రమణ, నాగమ్మ, రమణమ్మ, నాగరాజు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

శాంసంగ్ దుకాణం వద్ద నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

సాగునీటి సంఘాల ఎన్నికలు పటిష్టంగా నిర్వహిస్తాం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాలు అనుసరించి జిల్లాలోని చిన్న నీటిపారుదల కింద ఉన్న 164 నీటి వినియోగదారుల సంఘాలకు పటిష్టంగా ఎన్నికలు నిర్వహిస్తామని కలెక్టర్ శ్రీధర్ చామకూరి జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రివర్యులు నిమ్మల రామానాయుడుకు వివరించారు. మంగళవారం విజయవాడ నుంచి రాష్ట్రంలోని పెద్ద, మధ్య, చిన్న తరహా నీటిపారుల కింద ఉన్న నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించే అంశంపై జిల్లా కలెక్టర్లు, జల వనరుల శాఖ అధికారులతో రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లో తన ఛాంబర్ నుంచి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లా పరిధిలో పెద్ద, మధ్య తరహా నీటి వినియోగదారుల సంఘాలు లేవని, చిన్న నీటిపారుదల కింద 164 సంఘాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఇందులో 94 సంఘాలు ఉమ్మడి కడప జిల్లా, 70 సంఘాలు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఉన్నట్లు తెలిపారు. జిల్లాలో వెలిగల్లు, అన్నమయ్య రెండు మధ్యతరహా ప్రాజెక్టులు ఉన్నప్పటికీ వెలుగల్లు ఆయకట్టు పరిధిలో ఇంకను నీటి వినియోగదారుల సంఘాలు లేవని, అన్నమయ్య ప్రాజెక్ట్ కొట్టుకుపోయిందని పేర్కొన్నారు. ప్రతి నీటి వినియోగదారుల సంఘం 6 ప్రాదేశిక నియోజకవర్గాలను కలిగి ఉంటుందని, వాటిలో 3 ఎగువన, 3 దిగువ ప్రాంతాలు ఉంటాయని కలెక్టర్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో నీటిపారుదల రంగానికి ముఖ్యమంత్రి అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నారని పేర్కొన్నారు. నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్లకు సూచించారు. ఈనెల 16 నుంచి నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికల ప్రక్రియ మొదలు అవుతుందని, ఇందుకు సంబంధించిన షెడ్యూలు, నామినేషన్ పత్రాలను కలెక్టరేట్లకు పంపుతామని చెప్పారు. షెడ్యూల్ విడుదల చేసిన తరువాత రోజు వారి కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలన్నారు. నీటి వినియోగదారుల సంఘానికి 6 మంది ప్రాదేశిక సభ్యులను ఎన్నుకోవాలని, వారి నుంచి అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నిక చేయాలని పేర్కొన్నారు. నీటి సంఘానికి అధ్యక్షుడిని ఎగువ ప్రాంతాల నుండి ఎన్నుకుంటే, ఉపాధ్యక్షుడిని దిగువ ప్రాంతాల నుంచి, వైస్-వెర్సా నుండి తప్పక ఎన్నిక చేయాలని మంత్రి పేర్కొన్నారు. అనంతరం వివిధ అంశాలపై తగు సూచనలు జారీ చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌కు డిఆర్ఒ సత్యనారాయణరావు, ఆర్‌డిఒ రంగస్వామి, జల వనరుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

నగల కోసమే సిఐ తల్లి హత్య

- నమ్మిన యువకుడే నట్టేట ముంచాడు
- ఆరోగ్యం కుదుటపరుస్తామని చెప్పి అంతమొందించాడు
- 12 రోజుల తర్వాత వీడిన సిఐ తల్లి అదృశ్యం మిస్టరీ
- డిఎస్‌పి, తహశీల్దార్ సమక్షంలో పోస్టుమార్టం
- అంత్యక్రియలు నిర్వహించిన కుమారుడు

స్వర్ణకుమారి (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఒంటరిగా ఉన్న మహిళకు చేదోడు వాదోడుగా ఉంటానన్న యువకుడు నమ్మించి నట్టేట ముంచాడు. ఆమె వద్ద ఉన్న నగదు, నగల కోసం ఆశపడి ఆమెకున్న అనారోగ్యాన్ని ఎరగా చేసుకొని ఆరోగ్యం కుదుట పరుస్తానని చెప్పి మరో మిత్రుడు తో కలిసి అంతమొందించాడు. 12 రోజుల తర్వాత ఈ అదృశ్యం కేసు మిస్టరీని పోలీసులు చేదించి నిందితులను అదుపులోకి తీసుకు న్నారు. మృతురాలిని పూడ్చిపెట్టిన ప్రదేశంలో నే పోస్టుమార్టం నిర్వహించి హత్య కేసు నమోదు చేశారు. కేసుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుర్రంకొండ మండలం మేడికుర్తికి చెందిన స్వర్ణకుమారి (62) మదన పల్లి మండలం సిటిఎం చెందిన ప్యారం శ్రీరాములతో వివాహమైంది. వీరికి కుమారుడు నాగేంద్ర ఉన్నాడు. 30 ఏళ్ల క్రితం భర్తతో స్వర్ణకుమారి విడిపో యింది. అనంతరం మదనపల్లె దేవళంవీధిలో ఇల్లు నిర్మించుకుని ఇక్కడే స్థిరపడి కుమారుడితో కలిసి జీవించేది. కుమారుడు పోలీస్ శాఖలో ఉద్యోగం సంపాదించి ప్రస్తుతం ధర్మవరం సిఐగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆ తరువాత స్వర్ణకుమారి జగన్ కాలనీలో ఓ ఇంటిని నిర్మించి అక్కడ నివాసం ఉంటోంది. అదే ప్రాంతంలో మేడికుర్తికి చెందిన సురేంద్ర, యల్లమ్మ దంపతులు నివాస ముంటున్నారు. వీరికి కుమారుడు వెంకటేష్ ఉన్నాడు. స్వర్ణకుమారికి వెంకటేష్ చేదోడు వాదోడుగా ఉంటూ అప్పుడప్పుడు పనుల్లో సహాయ పడేవాడు. ఈ క్రమంలో స్వర్ణకుమారి వద్ద ఉన్న నగదు, నగలపై ఆశపడ్డాడు. ఎలాగైనా వాటిని కొట్టేయాలని పథకం పన్నాడు. స్వర్ణకుమారి అప్పుడప్పుడు తనకు ఆరోగ్యం బాగోలేదని వెంకటేష్‌తో చెబుతుండేది. దీన్ని ఆసరాగా చేసుకున్న వెంకటేష్ స్థానిక గజ్జలకుంటలో ఉన్న అనిల్ తో కలిసి నగదు, నగలు దోచుకునేందుకు పథకం పన్నాడు. నాటు వైద్యం చేసి మంత్రించేవారు నాకు తెలుసని, అక్కడికి వెళ్తే ఆరోగ్యం నయమౌతుందని స్వర్ణకుమారిని వెంకటేష్ నమ్మించాడు. ఈ క్రమంలో సెప్టెంబర్ 28వ తేదీన తన ద్విచక్ర వాహనంలో స్వర్ణకుమారిని ఎక్కిం చుకొని గజ్జల కుంటలో ఉన్న అనీల్ ఇంటికి వెళ్లాడు. అనిల్ ఇంట్లో మంత్రాలు చదువుతో స్వర్ణకుమారి పూజలో నిమగ్నమైన సమయంలో సుత్తితో ఆమె తలపై మోది హత్య చేశారు. ఆమె ఒంటిపై ఉన్న నగలను దోచుకుని స్థానికంగా ఉన్న ఓ ప్రయివేటు ఫైనాన్స్ బ్యాంకులో తాకట్టు పెట్టి సొమ్ము చేసుకున్నారు. అనంతరం ఆమె మృతదేహాన్ని ఓ గోనెసంచిలో వేసి, ఆరోజు రాత్రి నీరుగట్టు వారిపల్లి సమీపంలోని శ్మశాన వాటికలో అప్పటికే శవాన్ని పూడ్చి ఉన్న ఓ గుంతను తవ్వి అందులో గోనె సంచితో పాటే మృతదేహాన్ని వేసి కప్పెట్టేసి అక్కడి నుంచి పరారయ్యారు. అక్కడి నుంచి నేరుగా తిరుపతికి వెళ్లి రేణిగుంటలో ఫ్లైట్ ద్వారా బెంగళూరుకు చేరుకొని బెంగళూరు నుంచి రాజస్థాన్‌కు పరారయ్యారు. తల్లి అదృశ్యం కావడంతో కుమారుడు నాగేంద్ర అక్టోబర్ 1వ తేదీన తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అదృశ్యం కేసు నమోదు చేసిన పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తును ప్రారంభించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారిచ్చిన సమాచారంతో మంగళవారం నీరుగట్టువారిపల్లి శ్మశాన వాటికలో డిఎస్‌పి కొండయ్య నాయుడు, తహశీల్దార్ ఖాజాబీ ఆధ్వర్యంలో మృతదేహాన్ని వెలికి తీసి అక్కడే పోస్ట్ మార్టం నిర్వహించారు. మృతదేహాన్ని కుమారుడు నాగేంద్రకు అప్పగించారు. కుటుంబ సభ్యులతో కలిసి అదే ప్రాంతంలో తల్లికి అంత్యక్రియలు నిర్వహించాడు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

భారత వైమానిక దళం దేశంలో ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో లయన్ వి.నారాయణరెడ్డి ఆర్థిక సాయంతో స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు లయన్ పి.శివారెడ్డి మాట్లాడుతూ దేశానికి సేవలు అందించి, దేశం కోసం ప్రాణాలు సైతం లెక్క చేయకుండా దేశ వైమానిక దళంలో ఉద్యోగ విరమణ పొందిన మాజీ సైనికులు తమ వంతు ప్రజలకు సేవ చేయాలనుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు ఉపయోగ పడే మరిన్ని సేవ కార్యక్రమం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డేవిడ్ సుకుమార్, సీనియర్ వైద్యులు మహేశ్వర్ రాజు, జిఎంటి కో-ఆర్డినేటర్ లయన్ పిఎస్ హరినాథ్, జోనల్ చైర్మన్ లయన్ షేక్ మొహమ్మద్, జిల్లా చైర్మన్ లయన్ వి.హరీష్ చంద్ర, లయన్ పవన్ కుమార్ నాయుడు, లయన్స్ క్లబర్ సభ్యులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో రోగికి పండ్లు ఇస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వ్యాన్‌ను ప్రారంభిస్తున్న వెలుగు సిబ్బంది

వెలుగు సంస్థకు వ్యాన్ వితరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అమ్మచెరువుమిట్టలోని వెలుగు సంస్థకు ఇండియాన్ ఆయిల్ కార్పొరేషన్ వారు (ఐఒసి) సిఎస్ఆర్ ఫండ్స్ తరుపున టాటా వింగర్-14 సీటర్ వాన్‌ను బహూకరించారు. చిత్తూరు టెర్మినల్ మేనేజర్ ప్రేమ్ కుమార్ మంగళవారం వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ 28 ఏళ్లుగా దివ్యాంగులకు, వృద్ధులకు విశిష్ట సేవలను అందిస్తున్న వెలుగు సంస్థను గుర్తించి, వారి సేవలను మరింత మెరుగుపరచడానికి ఈ వాన్‌ను ఇచ్చామన్నారు. సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ వెలుగు సంస్థ కు ఐఒసి వారు గతంలో కూడా సోలార్, సోలార్ లైటింగ్ సిస్టం, డెస్కులు, బీరువాలు అందజేసి ఎంతో సహాయ సహకారం అందిస్తున్నారు. ఇప్పుడు ఇచ్చిన ఈ వ్యాన్‌తో మా వెలుగు సంస్థలో చిన్నారులు, వృద్ధులకు వాహన సదుపాయం మరింత మెరుగై రవాణా కార్యకలాపాలు సులభతర మవుతాయ్నారు. ఈ సందర్భంగా ఐఒసి సభ్యులైన డిప్యూటీ జనరల్ మేనేజర్ హైదరాబాద్ కైలాష్‌నాథ్, ఎపి స్టేట్ మేనేజర్ అమ్మిత్ సర్దార్, టెర్మినల్ అరుణ్ ప్రసాద్, ప్రేమ్ కుమార్, ఎల్‌పిజి సేల్స్ క్రాంతి, ఆనంద్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వ్యాన్ తాళాలను, కాగితాలను వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్‌రెడ్డికి ప్రేమ్ సాగర్ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వృద్ధులు, చిన్నారులకు పండ్లను పంచి పెట్టారు. అనంతరం వెలుగు సిబ్బంది, చిన్నారులు, వృద్ధులు నూతనంగా విచ్చేసిన టాటా వింగర్-14 సీటర్ వ్యాన్‌ను ప్రారంభించి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ట్రెజరర్ రఘునాథ్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, ఇసి మెంబెర్ సుజాత, సోషల్ వర్కర్ ఎం.గీత, వార్డెన్ స్వీటీ, సిబ్బంది, చిన్నారులు, వృద్ధులు పాల్గొన్నారు.

సోలార్ ఎనర్జీపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లి

మిట్స్ కళాశాలలో సోలార్ ఎనర్జీపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. హైదరాబాద్‌లోని ఫ్రేయర్ ఎనర్జీ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ముత్యాల వంశీకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సౌర విద్యుత్ సామర్థ్యం ప్రస్తుతం భారతదేశం ప్రపంచ వ్యాప్తంగా 4వ స్థానంలో ఉందన్నారు. ఏ ఇంటికైనా నెల వచ్చిందంటే భయపెట్టేది కరెంటు బిల్లే, గృహ విద్యుత్ దాదాపుగా ప్రతి రాష్ట్రంలోనూ వినియోగదారులకు భారంగానే మారుతోందన్నారు. గృహ వినియోగదారులకు పాతికేళ్ల వరకు పైసా కరెంట్ బిల్లు కట్టనవసరం లేకుండా ఇంటికి రాయితీపై తక్కువ ఖర్చుతో సౌర విద్యుత్తు వెలుగులు పంచే ఒక పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. కేవలం సౌర విద్యుత్తును ఏర్పాటు చేసుకోవడమే కాదు, మనం వాడుకోగా మిగిలిన కరెంటును ఎంచక్కా డిస్కంలకు అమ్మి సొమ్ము చేసుకునే ప్రయోజనం కూడా కలిగించే పథకమే రూఫ్‌టాప్ సోలార్ ప్రోగ్రామ్ అని పేర్కొన్నారు. గృహ వినియోగదారులను సౌర విద్యుత్తు వినియోగం వైపు ప్రోత్సహించి, మామూలు కరెంటు వినియోగాన్ని తగ్గించి వారికి విద్యుత్తు భారం నుంచి ఉపశమనం కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకమే రూఫ్ టాప్ సోలార్ ప్రోగ్రామ్ అని, వీటి పై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలన్నారు. కళాశాలలోని రేడియో స్టేషన్ ద్వారా శ్రోతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల గవర్నింగ్ బాడీ మెంబెర్ టి.జి. రవికుమార్ పాల్గొన్నారు.

రేడియో ద్వారా అవగాహన కల్పిస్తున్న వంశీకృష్ణ

'పంచాయతీ వారోత్సవాలను విజయవంతం చేద్దాం'



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి- రాయచోటి

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు జిల్లా నందలి అన్ని గ్రామ పంచాయతీలలో ఈనెల 14 నుంచి 20 వరకు పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉన్నామని కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ కు వివరించారు. మంగళవారం విజయవాడ నుంచి జిల్లా కలెక్టర్లు, ఉపాధి హామీ సమన్వయ శాఖల అధికారులతో ఉప ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఈనెల 14 నుంచి 20 వరకు చేపట్టే పల్లె పండుగ పంచాయ తీ వారోత్సవాలను విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌కు రాయచోటి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హాజంయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 23న జిల్లాలో నిర్వహించిన గ్రామసభల ద్వారా రూ.71 కోట్ల విలువైన పనులకు తీర్మానాలు చేశామని చెప్పారు. ఇందులో ఇప్పటికే రూ .65 కోట్ల విలువైన పనులకు పరిపాలన మంజూరు ఉత్తర్వులు జారీ చేశామని వివరించారు. సాంకేతిక సమస్యతో కొన్ని పనులు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని, దానిని పరిష్కరించి వాటికి కూడా వెంటనే పరిపాలన అనుమతులు జారీ చేస్తామని తెలియజేశారు. చేపడుతున్న పనులకు సంబంధించి ఎలాంటి ఇసుక, సిమెంట్ కొరత లేదన్నారు. జిల్లాలో ఈనెల 14 నుంచి స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో భూమి పూజలు, శంకుస్థాపనల ద్వారా పనులు ప్రారంభించేందుకు రూట్ మ్యాప్ సిద్ధంగా ఉంచుకున్నట్లు పేర్కొన్నారు. సంక్రాంతిలోగా ఆయా పనులన్నీ పూర్తి చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఉపముఖ్యమంత్రి వర్యులు కొణిదల పవన్ కల్యాణ్ మాట్లాడుతూ ఆగస్టు 23న రాష్ట్రవ్యాప్తంగా 13325 పంచాయతీల్లో ఒకే రోజున గ్రామసభలు నిర్వహించి తీర్మానం చేసిన పనులకు కలెక్టర్లే పరిపాలన ఆమోదపు ఉత్తర్వులు ఇచ్చారని, ఇందులో ఇప్పటివరకు 26715 పనులకు రూ.2,239 కోట్ల మేర ఆమోదపు ఉత్తర్వులు జారీ చేశామని చెప్పారు. ఇంకను రూ. 470 కోట్ల విలువైన పనులకు ఆమోదపు ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉందని, అలాగే రూ.1670 కోట్లకు సాంకేతిక ఆమోదాలు కూడా జారీ అయ్యాయని పేర్కొన్నారు. ఆయా పనులను అంతే వేగంగా సంక్రాంతి లోపు పూర్తి చేయాలని కలెక్టర్లను కోరారు. వారం పాటు నిర్వహించే పల్లె పండుగ వారోత్సవాలలో చేపట్టే భూమి పూజ, శంకుస్థాపనలలో మంత్రులు, శాసనసభ్యులు, సర్పంచుల, స్థానిక ప్రజాప్రతినిధులు అందరినీ భాగస్వాములను చేయాలన్నారు. ఈ వారోత్సవాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, చేపట్టే పనుల వివరాలను గ్రామాలలో ప్రదర్శించాలని సూచించారు. గ్రామాల్లో మరింత పారదర్శకత, ప్రజల్లో జవాబుదారీతనం పెంచడానికి ఒక పండుగ వాతావరణంలో వారోత్సవాలను నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, లైన్ డిపార్ట్మెంట్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు అందరూ ఇందులో భాగస్వాములు కావాలని, నిర్దిష్ట కాలంలో పనులన్నీ పూర్తి చేయడానికి బాధ్యతాయుతంగా కృషి చేయాలని ఉపముఖ్యమంత్రి పేర్కొన్నారు. సమావేశంలో పంచాయతీరాజ్, డ్వామా, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ సచివాలయ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కేన్సర్ రోగులకు కేశదానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కేశాలు దానం చేసున్న పవిత్ర

కేన్సర్ బాధితుల మోహల్లో చిరునవ్వు చిందించడానికి హెల్పింగ్ మైండ్స్ గొప్ప సంకల్పంతో తలపెట్టిన హెయిర్ డోనేషన్ కార్యక్ర మానికి మహిళలు, అమ్మాయిలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కేశాలు దానం చేస్తున్నారు. మంగళవారం పుంగనూరుకు చెందిన శ్రీనివాసు లురెడ్డి, విమల దంపతుల కుమార్తె పవిత్ర హెల్పింగ్ మైండ్స్ కార్యాల యానికి విచ్చేసి కేన్సర్ బాధితుల కోసం కేశాలు దానం చేసి ఆదర్శంగా నిలిచింది. కేశాలు దానం చేసిన పవిత్రకు ప్రశంస పత్రంతో పాటు పూలమొక్క బహుకరించి హెల్పింగ్ మైండ్స్ బృందం అభినందించింది. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్ధిక్ మాట్లాడుతూ కేన్సర్ బాధితులకు ఉచితంగా విగ్గులు తమ సంస్థ ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కేశాల దానంలో ఇప్పటికి 62 మంది కేశాలు దానం చేశారని, కేశాలు దానం చేస్తున్న మహిళలు, చిన్నారులు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. కేశాలు దానం చేసిన పవిత్ర మాట్లాడుతూ కేశాలు దానం తనకు ఎంతో ఆనందం కలిగిందని, మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు కిరణ్, గుణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైద్యాధికారి జవహర్‌బాబు

కలుషిత ఆహారంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-కలకడ

కలుషిత ఆహారం, తాగునీటిపై దృష్టి సారించాలని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య అధికారి ఎంవి కిషోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు ఎంవి. కిషోర్‌కుమార్‌రెడ్డి, జిల్లా ప్రోగ్రామ్ అధికారి కె.మునిశ్వర ఆధ్వర్యంలో ఆశాడే నిర్వహించినట్లు తెలిపారు. ఆశడే ఉద్దేశించి వైద్యా ధికారి మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని అన్నారు. కలుషితమైన నీరు, ఆహారం తీసుకోవడం వల్ల అనారోగ్యబారిన వివిధ రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. చేతులు ఎలా శుభ్ర చేసుకునే పద్ధతులు గురించి ఆశా కార్యకర్తలకు చేసి చూపించారు. ఆశ యాప్ గురించి అప్‌డేట్ చేయుట, ఐఎఫ్ఎ మాత్రలు, ఐఎఫ్ఎ సిరప్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి జవహర్ బాబు, ఎంపిహెచ్ఇఒ జి.జయరామయ్య, పిహెచ్ఎన్ సుబ్బరత్న, హెల్త్ సూపర్‌వైజర్‌లు వెంకటేశ్వరరావు, రెడ్డమ్మ ఆరోగ్య కార్యకర్తలు వాణి శ్రీలక్ష్మి ,లక్ష్మి, శ్రీ లక్ష్మీదేవి ఎంఎల్‌హెచ్ పిలు రాజ సులోచన, గోపికృష్ణ, అశ్విని, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి సరఫరా పునరుద్ధరణ : ఎఇ

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

నూతనంగా ఏర్పాటుచేసిన పైప్‌లైన్

జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో నీటి సరఫరాను పునరుద్ధరించినట్లు ఆర్‌డ బ్ల్యూఎస్ ఎఇ మిధున్ చక్రవర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమ్మ నపల్లి పంచాయతీలోని దండు వారిపల్లె వద్ద ఉన్న జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో గతంలో ఇళ్ల నిర్మాణాల కోసం ఏర్పాటు చేసిన నీటి సరఫరా పైపులైన్‌ను కొందరు ధ్వంసం చేశారని అన్నారు. దండువారిపల్లె లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను చేపట్టడానికి నీటితో ఇబ్బంది పడుతున్నట్లు లబ్ధిదారులు తమ దృష్టికి సమస్యను తీసుకువచ్చారని అన్నారు. లబ్ధిదారుల సమస్యలను పరిష్కరించడానికి వెంటనే స్పందిస్తూ ధ్వంసమైన పైపుల స్థానంలో కొత్త పైపులను ఏర్పాటు చేసి, నీటి ట్యాంకుకు అనుసంధానించి, నీటి సరఫరాను పునరుద్ధరించినట్లు చెప్పారు. నీటి సమస్య పరిష్కారం కావడంతో లేఅవుట్ లోని లబ్ధి దారులు ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కోరారు.

నేడు 'ఆదిత్య'లో ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి - బి.కొత్తకోట

పట్టణంలోని రంగసముద్రం రోడ్డులో గల ఆదిత్య డిగ్రీ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్‌డే నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఎల్.ప్రసాద్ పేర్కొన్నారు. కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలికేందుకు సీనియర్ విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తు న్నారని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మదనపల్లి పట్టణానికి చెందిన ప్రకృతి వనం వ్యవస్థాపకులు ప్రసాద్ హాజరవుతారన్నారు .ఉదయం 9.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వీధికుక్కల బెడద నుంచి రక్షణ కల్పించండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక పట్టణ శివారు ప్రాంతాల్లో వీధికుక్కల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని దిటౌన్ అపెక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గొల్లపూడి తిరుపతిరావు సంబంధిత అధికారులను కోరారు. దీనిపై మదనపల్లె మునిసిపాలిటీ కమిషనర్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కాలనీలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందనిఆందోళన వ్యక్తం చేశారు. వీధి కుక్కలు స్థానికేతరులతోపాటు స్థానికంగా నివాసముండే వారిని సైతం కరస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కుక్క కాటుకు గురై చికిత్స పొందుతున్నారని అన్నారు. పాఠశాలలు, విద్యాసంస్థల పరిసరాల్లో గుంపులు, గుంపులుగా కుక్కలు తిరుగుతూ భయందోళనలకు గురి చేస్తున్నాయని అన్నారు. చిన్నపిల్లలపై వీధి కుక్కలు దాడి చేసే ప్రమాదం పొంచి ఉందని, వీధి కుక్కల బారి నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలని తెలిపారు.

వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్

గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందిద్దాం

ప్రజాశక్తి-పీలేరు

గ్రామీణ ప్రాంత ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ మెరుగైన వైద్య సేవల ను అందించాలని తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వివిధ స్థాయి ఆరోగ్య సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ లక్ష్యసాధనకు ఆరోగ్య సమస్యలు అవరోధాలు కాకూడదని అన్నారు. మన ఆరోగ్యానికి హాని కలిగించే ఆహారపదార్థాల నుంచి ఇతర ప్రతికూల అంశాల నుంచి దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడంలో ప్రజలకు తెలపాలని సిబ్బందికి సూచించారు. దోమల వల్ల కలిగే వ్యాధులు, కలుషిత ఆహారం, నీరు, గాలి వల్ల వచ్చే మలేరియా, డెంగీ, పచ్చకామెర్లు, టైఫాయిడ్, అతిసారం, రక్త, బంక విరేచనాలు, జలుబు, దగ్గు లాంటి అంటు వ్యాధుల నుంచి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లోని ఆరోగ్య సమస్యలపై తక్షణం స్పందించి వ్యాధుల నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, ఎంపిహెచ్ఇఒ శ్రీనివాసులు, పర్యవేక్షకులు కృష్ణయ్య, కుసుమ, ఏఎన్ఎం లు, సిహెచ్‌ఒలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌సిసి శిక్షణతో ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి - కడప

ఎన్‌సిసి శిక్షణతో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని 30 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సిసి కమాండింగ్ అధికారి కల్నల్ సూర్యనారాయణ మూర్తి అన్నారు. మంగళవారం 8వ ఎన్‌సిసి కంబైన్డ్ శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్‌సిసి ద్వారా కేడెట్లకు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాల పెంపు, క్రమబద్ధమైన జీవన విధానానికి ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు బి. నాగ శేషాద్రి, ఓబులేసు, సిటిఒలు కిరణ్ కుమార్, నరేష్ బెహరా, భీమయ్య, సుబేదార్ మేజర్ అనిల్ కుమార్, సి. ఎల్. రెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న టెట్ పరీక్షలు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో ఎపి టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) రెండు సెషన్లలో ప్రశాతంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 8న నిర్వహించి రెండు సెషన్లలో 1,833 మందికి గాను 1,652 మంది హాజరయ్యారు. 181 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని డిఇఒ శైలజ తెలిపారు

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

పుల్లంపేట : రైతులకు సలహాలు అందిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని వ్యవసాయ శాఖ మండల అధికారి సుధాకర్ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని కేఆర్ కండ్రిక, వెంకటరెడ్డిపల్లె గ్రామాలలో రైతులతో సమావేశాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పచ్చిరొట్ట పంటల ద్వారా రసాయన ఎరువుల వాడకం తగ్గించి మంచి దిగుబడులను పొందడంతో పాటు పర్యావరణం కాపాడుకోవచ్చని అన్నారు. ప్రాంతీయ పరిశోధన కేంద్రం, ఊటుకూరు శాస్ర వేత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతీ రైతు భూసార పరీక్షల ఆధారంగా అధిక దిగుబడులు పొందే అవకాశం ఉందని అన్నారు. ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త శ్రీధర్ మాట్లాడుతూ అరటి, బొప్పాయి, మామిడిలో అధిక దిగుబడులు సాధించుటకు తీసుకొనవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. బొప్పాయిలో కంచె పంటలుగా జొన్న, మొక్కజొన్న, అవిసె వేయడం ద్వారా పసుపు జిగురు పళ్లెంలను ఎకరాకు 10 ఏర్పాటు చేయడం ద్వారా వైరస్ తెగుళ్ళను సమర్ధవంతంగా అరికట్ట వచ్చునని తెలిపారు. విత్తన శుద్ధి ద్వారా తెగుళ్లను నివరించవచ్చునని తెలిపారు.బొప్పాయి, మునగ పంటలను పరిశీలించి చీడ పీడల నివారణ చర్యలు రైతులకు తెలిపారు. కార్యక్రమంలో విహెచ్ఎలు రాజేష్ కరీం, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, మార్కెటింగ్ సిబ్బంది, వెంటటరెడ్డి పల్లి సర్పంచ్ హరికృష్ణరెడ్డి, శ్రీనివాసరాజు, వెంకట సుబ్బరాజు, సుబ్బరామ రాజు రైతులు పాల్గొన్నారు.**పుల్లంపేట :**మండల పరిధిలోని పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా పివిజిపల్లె వ్యవ సాయ, అనుబంధ శాఖల అధికారులు పరిశీలించారు. పివిజి గ్రామంలో అధికారులు మాట్లా డుతూ పొలం పిలు స్తుంది ఒక ప్రాముఖ్యత వ్యవసాయాన్ని విస్తరణ కార్యక్రమంలో భాగంగా ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు శాస్త్రవేత్తలు క్షేత్ర సమస్యలపై పరిష్కారం చూపిస్తామని తెలిపారు. తక్కువ పెట్టుబడి అధిక ఉత్పత్తి, నికర ఆదా యం దిశగా ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ద్రవ, జీవామృతం తయారీ విధానం, ప్రాము ఖ్యత గురించి రైతు వెంకటసుబ్బయ్య పొలంలో తయారుచేసి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసా యాధికారి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వరి, ఉలవలు, నువ్వులు వంటలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. గ్రామ ఉద్యాన సహాయకులు మాట్లా డుతూ మామిడి, పసుపు, అరటి ఎరువుల యాజమాన్యం గురించి తెలిపారు. పశుసంవర్ధక అధికారి మాట్లాడుతూ పశువులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇన్సూరెన్స్ పథకం గురించి వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.శ్రీకర్, ఎడిఎ అధికారి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మస్తాన్, ప్రభాకర్, సునీత పాల్గొన్నారు.**మదనపల్లె అర్బన్:** మెరుగైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు సాధ్యమని మండల వ్యవసాయ అధికారి నాగప్రసాద్ వెల్లడించారు. పెంచుపాడు రైతులతో పాటుగా వ్యవసాయ ,అనుబంధ శాఖల అధికారులు పొలాలను సందర్శించి రైతులకు వివిధ పంటలకు సంబంధించిన సలహాలు సూచనలు అందించి గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగప్రసాద్ మాట్లాడుతూ ముఖ్యంగా వరి పంటలో జింకు దాతు లోపాన్ని గుర్తించడం జరిగిందని, జింకు ధాతు లోప నివారణకు రైతులు ఒక హెక్టారుకు250 గ్రాములు చొప్పున జింక్ సల్ఫేట్ 12శాతం పొడిని పిచికారి చేసుకున్నట్లయితే జింకులోప నివారణ సాధ్యమవుతుందని తెలిపారు. టమోటా వేర్లు క్యాల్షియం దాతు నివారణకు కాల్షియం నైట్రేట్ ఒక హెక్టారుకు 20కిలోలు చొప్పున డ్రిప్‌లో అందించినట్లైతే నివారించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజశేఖర్ స్వామి, వెంకటరమణ వ్యవసాయ అధికారి శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి

- నూతన బోరు ఏర్పాటు

నూతన బోరును ప్రారంభిస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-చిన్నమండెం

ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించడమే తమ లక్ష్యమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిన్నర్సుపల్లె గ్రామంలో నీటి సమస్య తీర్చేందుకు నూతన బోరును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని రాయ చోటి, సంబేపల్లి, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, చిన్నమండెం ఆరు మండలాల్లో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నియోజకవర్గంలో నీటి సమస్య ఉన్న ప్రతి గ్రామంలో కొత్త బోర్లు వేసి, నీటి సమస్య పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారి స్తామని తెలిపారు. ప్రజల తాగునీటితో సమస్యతో ఇబ్బందులు పడకూడదన్నదే తమ ఉద్దేశమని అన్నారు. నూతన బోరు ప్రారంభం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి-గుర్రంకొండ

గుర్రంకొండ :త్రిపుర సుందరిదేవి అలంకారంలో రెడ్డెమ్మ

మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న రెడ్డమ్మ దేవత దేవస్థానంలో దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా ఆరవ రోజు లలితా త్రిపురసుందరిదేవిగా భక్తులకు దర్శ నమిచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించి, పరిమళభరిత పుష్పాలతో అమ్మవారి ఉత్సవ మూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. తదుపరి సామూహిక కుంకుమార్చన నిర్వహించడమైనది. భక్తులందరికీ తీర్థప్రసాదాలు, అన్న దానం చేశారు. చెర్లోపల్లికి చెందిన శ్రీరెడ్డి ప్రసాద్ నాయుడు ఉభ యదారులుగా వ్యవహరిం చారు. ఏడవ రోజు సరస్వతీ దేవిగా దర్శన మిస్తారని ఆలయ ఇఒ మంజుల తెలిపారు. **రాజంపేట అర్బన్ :** దసరా శరన్న వరాత్రి ఉత్సవాలలో భాగంగా 6వ రోజు రాజంపేట పట్టణ శివా రులోని మన్నూరులో వెలసిన ఉదయగిరి ఎల్లమ్మతల్లి కాత్యాయినీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. తాళ్లపాక గ్రామానికి చెందిన శివశంకర్, ఉమామహేశ్వరి దంపతులు ప్రసాదాలను పంపిణీ చేశారు. **నందలూరు :** మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో వెలిసిన శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి దేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 6 వరోజు రాత్రి మీనాక్షి దేవి అలంకారంలో శ్రీ వాసవికన్యకాపరమేశ్వరిదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పురోహితులు బండాత్మకూర్ శివకుమార్ శర్మ, ఆలయ అర్చకులు చెరుకుముడి మృత్యుం జయ రావు ఆధ్వర్యంలో పంచా మృతాభి షేకం, చండీ పారాయణం, నిర్వహిం చారు. సాయంత్రం మహిళలు సహస్ర నామ కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలను అందజేశారు. రాత్రి ఉదయ దారులుగా గెలివి నాగరత్నం శెట్టి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. అనంతరం అల్పాహార విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు యంబలూరు నరసిం హస్వామి, మాకం వెంకట కుమార్, చల పాటి నరసింహ శ్రేష్టి, సెక్రెటరీ గెలివి నాగ సురేంద్ర కుమార్, సంయుక్త కార్యదర్శులు యంబలూరు నరసింహ ప్రసాద్, నారాయణ, యువజన సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు సునీల్‌కుమార్, గెలివిలోకేష్, ఆర్యవైశ్య సంఘసభ్యులు పాల్గొన్నారు. బుధవారం సరస్వతిదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిస్తారని ఆలయ నిర్వాహకుల తెలిపారు.

తక్కువ ధరలకే నిత్యావసర వస్తువులు

ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు
జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

అధికారులతో మాట్లాడుతున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

ప్రజాశకి- రాయచోటి

జిల్లాలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా తక్కువ ధరలలో వంటనూనె, టమాట తదితర నిత్యావసర వస్తువులు అందుబాటులోకి తెస్తామని జెసి ఆదర్శ రాజేంద్రన్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నిత్యావసర వస్తువుల ధరల పర్యవేక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పండుగ సీజన్‌లో ప్రజలందరికీ వంటనూనెలు, టమాట, తదితర నిత్యవసర వస్తువుల ధరలు అందుబాటులో ఉండాలని, జిల్లాలోని వ్యాపారస్తులు అందరూ దీనికి సహ కరించాలన్నారు. తక్కువ ధరలలో నిత్యావసర వస్తువులను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని దీనికి సంబంధించిన చర్యలను వెంటనే తీసుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ, మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. తూనికలు కొలతల అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలోని వర్తకుల వద్ద ఉన్న మొత్తం స్టాక్ ను పర్యవేక్షించాలని, పరిమితులు దాటి స్టాక్ ఉన్నట్లయితే సంబంధిత వర్తకుల మీద చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జిల్లాలో ఏర్పాటు చేయనున్న ప్రత్యేక కౌంటర్లలో వంటనూనె, తదితర నిత్యవసర వస్తువుల ధరలను కమిటీ నిర్ణయించిందిన్నారు. ప్రియ గోల్డ్ వంటనూనె మార్కెట్ ధర రూ.128 రూపాయలు ఉండగా ప్రత్యేక కౌంటర్లలో రూ.122లు, ఫ్రీడం సన్‌ఫ్లవర్ నూనె మార్కెట్ ధర రూ.140లు ఉండగా ప్రత్యేక కౌంటర్లలో 133లు, ఎవరీ డే గోల్డ్ నూనె ధర మార్కెట్లో రూ.137లు, ఉంటే ప్రత్యేక కౌంటర్లలో రూ.130లు ఉంటుందని తెలిపారు. టమాటా ధరను రూ.50లుగా నిర్ణయించారు. సమావేశంలో పౌరసరఫరాల డిఎం శివరాం, ఎడి మార్కెటింగ్ త్యాగరాజు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రఘురాం, కొలతలు తూనికల శాఖ అధికారి,వ్యాపారస్తులు పాల్గొన్నారు.

నగరాన్ని శుభ్రం చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని పారిశుధ్య కార్మికులు నగరాన్ని ఎప్పటికప్పుడూ శుభ్రం చేయాలని ఇన్‌ఛార్జీ మున్సిపల్ కమిషనర్ రాకేష్ చంద్రం అన్నారు. మంగళవారం రాధాకృష్ణ నగర్, శంకరాపురం, అశోక్‌నగర్, సంజన్న సర్కిల్ ప్రాంతాలను శానిటేషన్ విభాగాధికారులతో కలిసి సందర్శించారు. నగరంలో శుభ్రతను మెరుగుపరచడానికి శానిటేషన్ విభాగం కార్మికులు రోడ్లను శుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. చెత్త పాయింట్లను శుభ్రం చేయాలని తెలిపారు. డ్రెయినేజీ కాలువల్లో చెత్త, చెదారం తొలగించాలని చెప్పారు. శంకరాపురం వద్ద పారిశుధ్య సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. యూనిఫారం తప్పకుండా దరించాలని పేర్కొన్నారు. డ్రైవర్లు, లోడర్లు చెత్త పాయింట్లను నిరంతరం శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వీధుల్లో స్ప్రేయింగ్ చేయాలని తెలిపారు.

ట్రాఫిక్ రూల్స్ కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - కడప

ప్రతి ఒక్కరికీ ద్విచక్ర వాహనాలు ఎంతో అవసరమని, ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని టూ టౌన్ ఎఎస్ఐ ఎం. సురేష్ బాబు అన్నారు. దసరా ఉత్సవాలలో భాగంగా అమ్మవారి శాల వద్ద ఆర్‌ఆర్ రాయల్ రషీద్ అసోసియేషన్ ముద్రించిన ట్రాఫిక్ రూల్స్ కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ఎఎస్ఐ సురేష్ బాబు మంగళవారం ప్రారంభించారు. మైనర్లు ద్విచక్ర వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావద్దని సూచించారు. కార్యక్రమంలో స్వర్ణకారుల సంక్షేమ సంఘం నగర ఉపాధ్యక్షులు గోరు గోల్డ్, ఆర్ఆర్ సంస్థ అధ్యక్షులు అబ్దుల్ కరీముల్లా, రాయల్ పాల్గొన్నారు.

టీకాలపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - వేంపల్లె : గర్భిణులు, బాలింతలు, పిల్లలకు వేసే టీకాలపై ఆశా కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించాలని అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. మం గళవారం ఆశా డే సందర్భంగా మండలంలోని తాళ్ళపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగే ఆశా కార్యకర్తలు సమావేశాన్ని అడిషనల్ డిఎంహెచ్ఒ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆశ కార్యకర్తలకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సి హెచ్ఒ మునిరెడ్డి, వైద్యులు నిజాముద్దీన్, పృథ్వీ, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా బేగం, ఎంఎ హెచ్ఇఒ ఫకృద్దీన్, ఎంవివి ప్రసాద్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే 'పుట్టా'

ప్రజాశక్తి - ఖాజీపేట : స్థానిక మెయిన్ బజార్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారిని మంగళవారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రిటైర్డ్ వ్యవసాయ శాఖ అధికారి మృతి

ప్రజాశక్తి - సింహాద్రిపురం : మండలంలోని వై.కొత్తపల్లెకు చెంది న రిటైర్డ్ వ్యవసాయ శాఖ అధికారి రవీంద్ర నాథ్‌రెడ్డి(82) మంగళవారం ఆయన స్వగృహంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన పులివెందుల మాజీ శాసనసభ్యుడు చవ్వా బాల్‌రెడ్డి రెండవ కుమారుడు. మృతుడికి భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమారులు, ఒక్క కుమార్తె ఉన్నారు. రవీంద్రనాథ్‌రెడ్డి మృతదేహాన్ని పలు వురు ప్రముఖులు సందర్శించి, నివాళులు అర్పించారు.

విద్యార్థులతో ఒకేషనల్ ట్రైనర్ రేవతి

వృత్తి విద్యా కోర్సుల్లో విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-కలకడ

విద్యార్థులకు వృత్తి విద్య కోర్సులపై అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపల్ మలం షావలి తెలిపారు. మండల కేంద్రమైన కలకడ ఆదర్శ పాఠశాల పది, ఇంటర్ విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులు ఆటోమొబైల్స్ వంటి వాటిపట్ల అవగాహన కల్పించి వాటి వల్ల ఉన్న ఉపయోగాలను వివరించినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా అనే పథకం ద్వారా విద్యార్థుల్లో ఉండే నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ శిక్షణ కార్యక్రమం పది రోజులపాటు ఉంటుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ శిక్షణ కోసం ఒకేషనల్ కో-ఆర్డినేటర్ శివారెడ్డి, ఒకేషనల్ ట్రైనర్ రేవతి విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించాలి

ప్రజాశక్తి -చిట్వేలి

మండల పరిధిలోని స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌ను విద్యుత్ శాఖ డిఇ రాజశేఖర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచుగా సబ్ స్టేషన్ల పర్యవేక్షణలో భాగంగానే ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరా అవుతున్న అన్ని ప్రదేశాల్లో ఆయా పరిధిలోని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి ప్రమా దాలు జరగకుండా చూడాలని అన్నారు. విద్యుత్ అంతరాయం కూడా కలగకుండా ముంద స్తుగా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. విద్యుత్ బకాయిలను సకాలంలో చెల్లించేలా వినియోగదారులకు అవగాహన కల్పించి బిల్లులు త్వరితగతిన చెల్లించేందుకు కృషి చేయాలన్నారు. చిట్వేలిలో తరచుగా విద్యుత్ అంతరాయం పట్ల చర్యలు తీసుకోవాలని స్థానిక విద్యుత్ శాఖ అధికారి చలపతిని ఆదేశించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'గ్రామ కమిటీలను బలోపేతం చేయాలి'

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని అన్ని మండలాలలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి అనుబంధ సంఘాల నూతన గ్రామ కమిటీలను బలోపేతం చేయాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ మాదిగ పేర్కొన్నారు. పట్టణంలోని భాను రెసిరెన్సీలో ఎంఆర్‌పిఎస్ ముఖ్య నాయకుల సమీక్షా సమావేశం జిల్లా అధ్యక్షులు వై.రవీంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రామక్రిష్ణ మాట్లా డుతూ మందకృష్ణ మాదిగ గత 30 సంవత్సరాలుగా మాదిగ, మాదిగ ఉపకులాల ఉజ్వల భవిష్యత్ కై షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ లక్ష్య సాధనకై సమాజంలోని పేద వర్గాల హక్కుల సాధనకు, పేదలకు చారిత్రాత్మక సంక్షేమ పథకాలు సాధించి పెట్టడానికి అలుపెరుగనిపోరాటాలు చేశారని అన్నారు. నీతి, నిజాయితీ గా చిత్త శుద్ధి ఎస్‌సి వర్గీకరణ లక్ష్యం కోసం నిరంతరం పోరాటాలు చేసి ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత తీసుక వచ్చారని అన్నారు. సుప్రీంకు ఎస్‌సి వర్గీకరణకు అనుమతించడంలో మందక్రిష్ణ కృషి మరువలేనిదని అన్నారు. ఎస్‌సి వర్గీకరణతో మాదిగల జీవితాలు మెరుగుపడతాయని అన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధిలో రిజర్వేషన్లు అమలవుతాయ, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాలోని పాత కమిటీలు రద్దు చేసి ప్రతీ ఒక్క నాయకునికి ఒక్క మండలం చొప్పున ఇన్‌ఛార్జిలను నియమించడం జరుగ తుందన్నారు. త్వరలో గ్రామ కమిటీలు పూర్తి చేసి యుద్ధ ప్రాథపదికన మండల కమిటీలు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి సీనియర్ నాయకులు వెలగచర్ల శివయ్య మాదిగ, జిల్లా ఇన్‌ఛార్జి దుమ్ము చిన్న, లాయర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు రమణ, ఎంఆర్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగళ్ల శ్రీనివాసులు, ఎంఆర్పిఎస్ రాయచోటి నాయకులు సివి.రమణ, సురేష్, రాజంపేట వెంకటేష్, ఎంఎస్‌పి పీలేరు నియోజకవర్గం ఇంచార్జ్ గండికోట వెంకటేష్, సీనియర్ నాయకులు శ్రీనివాసులు, గురవయ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామకృష్ణ

క్రైం కార్నర్

పట్టుబడిన నిందితులు, స్వాధీనం చేసుకున్న ఆవులతో పోలీసు సిబ్బంది

ఆవుల చోరీ కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-పీలేరు

ఆవుల చోరీ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు కెవిపల్లి ఎఎస్ఐ పిజి లక్ష్మీదేవి తెలిపారు. మంగళవారం కెవిపల్లి పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎఎస్ఐ మాట్లాడుతూ కెవిపల్లి మండలం, లక్ష్మీరెడ్డిగారిపల్లికి చెందిన షేక్ ఖాదర్ బాషా కుమారుడు షేక్‌డ ఖాజా అనే వ్యక్తి గర్నిమిట్టలో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడన్నారు. చెడు వ్యసనాలకు అలవాటుపడి, గ్రామంలో చిన్న చిన్న దొంగతనాలు చేయడం అలవాటు చేసుకున్నాడని తెలిపారు. నిందితుడు పీలేరుకు చెందిన తన బంధువైన షేక్ సలీనాతో వివాహేతర సంబంధం కలిగి ఉంటూ, ఈ ఇరువురూ మండలంలోని లక్ష్మీరెడ్డిగారిపల్లి, కుమ్మరపల్లి పరిసర ప్రాంతాల్లో మేత మేసే, పశువుల దొడ్డిలోని మూడు ఆవులు చోరీ చేసి, వాటిని తమ ఆవులే అంటూ నమ్మబలికి, అమాయకులకు అమ్మి సొమ్ము చేసుకుని, విలాసాలకు ఖర్చు చేసేవారని అన్నారు. పాడి ఆవుల బాధితులనుంచి అందిన ఫిర్యాదు మేరకు ఉన్నతాదికారుల ఆదేశాలతో విచారణ జరపి, మంగళవారం గర్నిమిట్ట సమీపంలో షేక్ ఖాజా, షేక్ సలీనా లను అరెస్టు చేసి, వారు చోరీ చేసి అమ్మిన మూడు ఆవులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపామని తెలిపారు. కేసును త్వరగా పరిష్కరించిన పోలీసు సిబ్బందిని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, రాయచోటి డిఎస్‌పి, కలకడ సిఐలు అభినందించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-రామసముద్రం

కర్ణాటక నుంచి అక్రమ మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట సుబ్బయ్య తెలిపారు. వివరాల్లోకి వెళితే కర్ణాటక రాష్ట్రం, చింతామణి తాలూకా, కెంపదేనహల్లి గ్రామనికి చెందిన రాజన్న కుమారుడు మురళీకుమార్ రూ.25వేలు విలువగల మద్యం అక్రమంగా తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.